ఓటింగ్ శాతం పెంచాలి : కలెక్టర్ సిక్తా

మాట్లాడుతున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్

హనుమకొండ మే 3 : లోక్‌సభ ఎన్నికల్లో ఓటర్లు తప్పకుండా తమ ఓటు హక్కును వినియోగించుకుని ఓటింగ్ శాతం పెంచాలని కలెక్టర్ సిక్తా పట్నాయక్ పిలుపునిచ్చారు. శుక్రవారం సుబేదారిలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో స్వీప్ ఆధ్వర్యంలో ఓటరు చైతన్య కార్యక్రమం నిర్వహించారు. ప్రిన్సిపాల్ జ్యోతి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ ఓటు వేసినప్పుడే ప్రశ్నించే అధికారం లభిస్తుందన్నారు. ఓటింగ్ తక్కువగా నమోదవుతున్న జాబితాలో వరంగల్ పశ్చిమ నియోజకవర్గం ఉందని, అందుకే స్వీప్ ఆధ్వర్యంలో కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎన్నికల్లో నిర్భయంగా ఓటు వేస్తామని విద్యార్థులు ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో స్వీప్ అడిషనల్ నోడల్ ఆఫీసర్ శ్రీనివాసరావు, వైస్ ప్రిన్సిపాల్ రమేశ్, జిల్లా సంక్షేమాధికారి మధురిమ పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో వసతులు కల్పించాలి..

పోలింగ్ కేంద్రాల పద్ద అన్ని వసతులు కల్పించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ నుంచి జూమ్ మీటింగ్ ద్వారా అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ నెల 5 నాటికి ఓటరు స్లిప్పుల పంపిణీ పూర్తి చేయాలన్నారు. పోలింగ్ కేంద్రాల్లో వందశాతం వెబ్ కాస్టింగ్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. వృద్ధులు, దివ్యాంగులకు సరైన ఏర్పాట్లు చేయాలన్నారు. వేసవి దృష్ట్యా వైద్యులు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి, డీఆర్వో వైవీ గణేశ్, జడ్పీ సీఈవో విద్యాలత, డీఆర్డీవో నాగ పద్మజ, డీపీవో లక్ష్మీ రమాకాంత్, డీఎంహెచ్‌వో సాంబశివరావు, నోడల్ అధికారి రవీందర్ సింగ్ పాల్గొన్నారు.

ర్యాండమైజేషన్ పూర్తి : కలెక్టర్ ప్రావీణ్య

సమావేశంలో మాట్లాడుతున్న ఆర్వో ప్రావీణ్య

ఖిలావరంగల్, మే 3: రాజకీయ పార్టీ ప్రతినిధుల సమక్షంలో అదనపు ఈవీఎంల సప్లిమెంటరీ ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తి చేశామని వరంగల్ లోక్‌సభ ఎన్నికల ఆర్వో, కలెక్టర్ పీ ప్రావీణ్య అన్నారు. కలెక్టరేట్‌లో శుక్రవారం ఆమె సమీక్షించారు. వరంగల్ జిల్లాలోని వరంగల్ తూర్పు, వర్ధన్నపేట, నర్సంపేట అసెంబ్లీ నియోజకవర్గాల్లో 792 పోలింగ్ కేంద్రాలకు సంబంధించి మొత్తం బ్యాలెట్ యూనిట్లు 2,615 అవసరం ఉన్నాయన్నారు. ఇందులో మొదటి ర్యాండమైజేషన్ ద్వారా 988, సప్లమెంటరీ ర్యాండమైజేషన్ ద్వారా 1627 బీయూలు, వీవీ ప్యాడ్స్ 1108 కేటాయించినట్లు చెప్పారు. సమీక్షలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, ఆర్డీవోలు కృష్ణవేణి, సిడాం దత్తు, రాజకీయ పార్టీల ప్రతినిధులు ఈవీ శ్రీనివాస్, అమరేందర్‌రెడ్డి, ఇంజ్ల నాగేశ్వరరావు, ఫైజోద్దీన్ పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాలు కల్పించాలి

పోలింగ్ కేంద్రాల వద్ద మౌలిక వసతులు కల్పించాలని కలెక్టర్ ప్రావీణ్య అన్నారు. కలెక్టరేట్ నుంచి ఎంపీడీవోలు, తహసీల్దార్లు, ఎంపీవోలు, సెక్టార్ అధికారులు, కార్యదర్శులు, వైద్యాధికారులతో జూమ్ మీటింగ్ నిర్వహించారు. 10లోగా అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. డీఆర్డీవో కౌసల్యదేవి, డీపీవో కల్పన, డీఎంహెచ్‌వో వెంకటరమణ పాల్గొన్నారు.

ఓటు వేసిన 121 మంది

వరంగల్ జిల్లాలో హోం ఓటింగ్ ద్వారా 121 మంది తమ ఓటు హక్కు వినియోగించుకున్నట్లు ఆర్వో పీ ప్రావీణ్య శుక్రవారం తెలిపారు. వరంగల్ తూర్పులో 60, వర్ధన్నపేట నియోజకవర్గంలో 61 మంది వృద్ధులు ఓటు వేసినట్లు తెలిపారు. అలాగే, ఫెసిలిటేషన్ కేంద్రాల్లో 27 మంది ప్రభుత్వ ఉద్యోగులు ఓటు వేశారన్నారు.

ఆరు గ్యారెంటీలను అమలు చేసి ఓట్లడగాలి

పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి

సమావేశంలో మాట్లాడుతున్న చల్లా ధర్మారెడ్డి

సంగెం/గీసుగొండ, మే 3 : అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేసి లోక్‌సభ ఎన్నికల్లో ఓట్లు అడగాలని పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి అన్నారు. సంగెం మండలంలోని చింతలపల్లి, వంజరపల్లి, కృష్ణానగర్, సంగెం, కుంటపల్లి, కాట్రపల్లి, వెంకటాపూర్, గీసుగొండ మండలంలోని ఊకల్, వంచనగిరి, శాయంపేట, మరియపురం, గంగదేవిపల్లి, కోనాయిమాకుల, గీసుగొండ, రాంపూరం, మనుగొండ, చంద్రయ్యపల్లిలో శుక్రవారం బీఆర్ఎస్ కార్యకర్తలతో సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేవుళ్ల మీద ఒట్లు వేస్తూ మరోసారి ప్రజలను మోసం చేయాలని రేవంత్‌రెడ్డి చూస్తున్నారన్నారు. నీళ్లు లేక పంటలు ఎండిపోతున్నా రైతులను పట్టించుకునే వారు లేరని, ప్రజలు ఆలోచించాలని కోరారు. మోసకారి కాంగ్రెస్ పార్టీ హామీలను మరోసారి నమ్మి మోసపోవద్దన్నారు. సీఎంగా కేసీఆర్ ఉన్నంత కాలం రైతులు దర్జాగా ఉన్నారని, కాంగ్రెస్ పాలనలో రైతులకు మళ్లీ కష్టాలు మొదలయ్యాయన్నారు. బీఆర్ఎస్ గెలిస్తేనే రాష్ట్రం సుభిక్షంగా ఉంటుందని ప్రజలు విశ్వసిస్తున్నారని తెలిపారు. ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలిస్తే కాంగ్రెస్ ఇచ్చిన హామీలను మెడలు వంచి అమలు చేయిస్తామన్నారు. బీజేపీ కక్షసాధింపు చర్యలకు దిగుతున్నదని, ప్రశ్నించే వారిపై కేసులు పెడుతూ అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నదన్నారు. దేశంలో ప్రాంతీయ పార్టీలు లేకుండా చేయాలని బీజేపీ కుట్ర పన్నుతోందని విమర్శించారు. లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులు అత్యధిక మెజార్టీతో గెలుస్తారని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నిమ్మగడ్డ వెంకటేశ్వర్‌రావు, జడ్పీటీసీలు గూడ సుదర్శన్‌రెడ్డి, పోలీసు ధర్మారావు, సాగర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ సదానందం, దోపతి సమ్మయ్య, దొనికెల శ్రీనివాస్, మన్సూర్‌అలీ, శంకర్‌రావు, సదయ్య, అనిల్, మండలాధ్యక్షుడు వీరగోని రాజ్‌కుమార్, కట్టయ్య, చిన్ని, మల్లారెడ్డి, ప్రకాశ్, సంపత్ పాల్గొన్నారు.

రైతులను కూలీలుగా మార్చిన కాంగ్రెస్ : పెద్ది

రంగాపూర్‌లో మాట్లాడుతున్న పెద్ది సుదర్శన్‌రెడ్డి

నల్లబెల్లి, మే 3: నమ్మిన రైతాంగాన్ని నట్టేట ముంచిన కాంగ్రెస్ ప్రభుత్వం నేడు అన్నదాతలను ఉపాధి కూలీలుగా మార్చిందని నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి అన్నారు. బీఆర్ఎస్ మహబూబాబాద్ ఎంపీ అభ్యర్థి మాలోత్ కవిత గెలుపు కోసం శుక్రవారం ఆయన మండలంలోని నందిగామ, రేలకుంట, రంగాపూర్, బోల్లోనిపల్లె, గోవిందాపూర్, శనిగరం, నారక్కపేట, నల్లబెల్లిలో పార్టీ నాయకులు, కార్యకర్తలతో సన్నాహక సమావేశం నిర్వహించారు. అలాగే, ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీల వద్దకు వెళ్లి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. సీఎం రేవంత్‌రెడ్డితోపాటు స్థానిక ఎమ్మెల్యేకు సాగునీటి ప్రాజెక్టులపై అవగాహన, ముందు చూపు లేక పోవడంతో యాసంగి పంటలు ఎండిపోయాయని పెద్ది విమర్శించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం నర్సంపేట నియోజకవర్గంలోని 292 గొలుసుకట్టు చెరువులను అభివృద్ధి చేయడంతో మండు వేసవిలోనూ మత్తళ్లు దూకినట్లు గుర్తుచేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత రంగాయ చెరువు, పాకాల సరస్సులో సరిపడా నీరులేక 50 శాతం మాత్రమే వరినాట్లు వేసినట్లు తెలిపారు. కారు గుర్తుకు ఓటు వేసి మాలోత్ కవితను అధిక మెజార్టీతో గెలుపించుకోవాల్సిన బాధ్యత ప్రజలపై ఉందన్నారు. సమావేశంలో జడ్పీ ఫ్లోర్‌లీడర్ పెద్ది స్వప్న, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బానోత్ సారంగపాణి, పీఏసీఎస్ చైర్మన్ చెట్టుపెల్లి మురళీధర్‌రావు, మాజీ ఎంపీపీ కక్కెర్ల శ్రీనివాస్‌గౌడ్, పార్టీ మండల మాజీ కన్వీనర్ ఊడుగుల ప్రవీణ్‌గౌడ్, క్లస్టర్ ఇన్‌చార్జీలు గందె శ్రీనివాస్‌గుప్తా, ప్రతాప్‌సింగ్, మోహన్‌రెడ్డి, రాంబాబు పాల్గొన్నారు. అనంతరం పలువురు రైతులు, ఆసరా పింఛన్ లబ్ధిదారులు మాట్లాడుతూ 'కేసీఆర్ సార్ రైతులకు ఏ కట్టం వచ్చినా తల్లడిల్లుండు. పంటలకు నీళ్లిచ్చిండు, బిడ్డల పెండ్లికి రూ.లక్ష, ముసలోళ్లకు పింఛన్ ఇచ్చిండు, ఇంటి ముందు రోడ్డు పోసిండు, తాగేందుకు నీళ్లించిండు. కరోనా వత్తే కాపాడిండు' అని గుర్తుచేసుకున్నారు.

8న ప్రధాని మోదీ రాక

మడికొండ, మే 3: ప్రధాని నరేంద్రమోదీ ఈ నెల 8న వరంగల్‌కు వస్తున్నారని బీజేపీ వరంగల్ పార్లమెంట్ అభ్యర్థి అరూరి రమేశ్ తెలిపారు. 44వ డివిజన్ లక్ష్మీపుర్ మైదానంలో లక్ష మందితో భారీ బహిరంగ సభ కోసం ఆయన శుక్రవారం ఏర్పాట్లు ప్రారంభించారు. సభకు వచ్చే వాహనాల కోసం పార్కింగ్ తదితర ఏర్పాట్లను బీజేపీ క్రమశిక్షణ కమిటీ చైర్మన్ మార్తినేని ధర్మారావు, రావు పద్మ, మాజీ ఎమ్మెల్యేలు రాజేశ్వర్‌రావు, వడ్డాల శ్రీరాములు, కొండేటి శ్రీధర్, వరంగల్ తూర్పు ఇన్‌చార్జి ఎర్రబెల్లి ప్రదీప్‌రావు పరిశీలించారు.

'అరూరికి ఓటుతో బుద్ధి చెప్పాలి'

హసన్‌పర్తి/ఖిలావరంగల్, మే 3: ఆస్తులను కాపాడుకునేందుకు బీజేపీలో చేరిన బీజేపీ ఎంపీ అభ్యర్థి అరూరి రమేశ్‌కు ఓటుతో బుద్ధి చెప్పాలని కాంగ్రెస్ అభ్యర్థి కడియం కావ్య పిలుపునిచ్చారు. ఎర్రగట్టు గుట్టు సమీపంలోని కేఎల్‌ఎన్ కన్వెన్షన్ హాల్‌లో వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు ఆధ్వర్యంలో శుక్రవారం జరిగిన సన్నాహక సమావేశంలో ఆమె మాట్లాడారు. స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి, డీసీసీబీ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు, వరంగల్ డీసీసీ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ పాల్గొన్నారు. అలాగే, ఖిలావరంగల్‌లో కూడా కడియం కావ్య ప్రచారం నిర్వహించారు.

కోటలో బీఆర్ఎస్ సమావేశం

ఖిలావరంగల్, మే 3: వరంగల్ 38వ డివిజన్‌లోని ముదిరాజ్ భవనంలో శుక్రవారం రాత్రి బూత్ కమిటీ నియామక సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ హాజరై కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు.

అబ్జర్వేషన్ హోమ్‌కు 18 మంది మైనర్లు

పోచమ్మమైదాన్, మే 3 : వరంగల్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో వాహన డ్రైవింగ్ చేసిన 18 మంది మైనర్లను గుర్తించి, జువైనల్ కోర్టులో చార్జిషీట్స్ ఫైల్ చేశారు. ఈ మేరకు ఒకరోజు బాలల అబ్జర్వేషన్ హోమ్‌కు పంపారని ట్రాఫిక్ సీఐ కె.శ్రీధర్ తెలిపారు.

కడిపికొండలో ఒకరి అదృశ్యం

మడికొండ, మే 3: కడిపికొండకు చెందిన కొడవటి రవి గురువారం ఇంటి నుంచి వెళ్లి అదృశ్యమైనట్లు ఎస్సై రాజబాబు తెలిపారు. రవి భార్య ఉమామహేశ్వరి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

సమ్మర్ క్లాసులు, క్యాంపులు నిర్వహిస్తే కఠిన చర్యలు

హనుమకొండ చౌరస్తా, మే 3: ప్రైవేటు స్కూల్స్ యాజమాన్యాలు వేసవి సెలవుల్లో ప్రైవేటు క్లాసులు, సమ్మర్ క్యాంపులు నిర్వహిస్తే పాఠశాలల గుర్తింపు రద్దు చేస్తామని జిల్లా విద్యాశాఖాధికారి అబ్దుల్ హై హెచ్చరించారు. పాఠశాలలను జూన్ 11న మాత్రమే రీ ఓపెన్ చేయాలని సూచించారు.

ఆర్థిక ఇబ్బందులతో వ్యాపారి ఆత్మహత్య

సురేశ్(ఫైల్)

నర్సంపేట, మే 3: ఆర్థిక ఇబ్బందులతో ఓ వ్యాపారి ఆత్మహత్య చేసుకున్న ఘటన నర్సంపేట పట్టణంలో జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. మార్త సురేశ్(44) పాకాల రోడ్డులో కిరాణా షాపు నిర్వహిస్తున్నాడు. కొంతకాలం క్రితం బ్యాంకులో రుణం తీసుకున్నాడు. ఆర్థిక ఇబ్బందులు తలెత్తడంతో లోన్ డబ్బులు చెల్లించడంలో జాప్యం జరిగింది. దీంతో రూ. 46 లక్షలు చెల్లించాలని ప్రైవేట్ బ్యాంక్ సురేశ్‌కు, ఆతడి భార్యకు కోర్టు నుంచి సమన్లు జారీ చేసింది. దీంతో మనస్తాపం చెందిన సురేశ్ ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

భార్య తిరిగి రాలేదని మరో యువకుడు..

కరీమాబాద్, మే 3: రంగశాయిపేటలో ఒకరు ఆత్మహత్య చేసుకున్నారు. ధర్మసాగర్‌కు చెందిన ముని వంశీ(29) కొన్నేళ్ల క్రితం ప్రేమ వివాహం చేసుకుని రంగశాయిపేటలోని ఓ బిర్యానీ సెంటర్‌లో పని చేస్తున్నాడు. ఇటీవల తన భార్య పని మీద వెళ్లి తిరిగి రాలేదు. మనస్తాపం చెందిన అతడు ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు స్థానికులు తెలిపారు.

రైలు కిందపడి మరొకరు..

కాజీపేట, మే 3 : ఆర్థిక ఇబ్బందులతో మద్యానికి బానిసై, మనస్తాపానికి గురైన ఓ వ్యక్తి కాజీపేట రైల్వే జంక్షన్ శివారులోని ఎఫ్ క్యాబిన్ సమీపంలో గుర్తు తెలియని రైలు కింద పడి గురువారం రాత్రి ఆత్మహత్య చేసుకున్నాడు. జీఆర్పీ సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం.. దర్గా కాజీపేటకు చెందిన దరావత్ రాములు (50) మద్యానికి బానిస కావడంతో ఇంట్లో తరచూ గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో ఆర్థిక ఇబ్బందులతో మనస్తాపానికి గురైన ఆయన రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని, మృతదేహానికి పోస్ట్ మార్టం చేయించి, బంధువులకు అప్పగించినట్లు రైల్వే పోలీసులు తెలిపారు.

విద్యుత్‌ను పొదుపుగా వాడాలి

నర్సంపేట, మే 3: విద్యుత్‌ను పొదుపుగా వాడాలని ఎన్పీడీసీఎల్ సీజీఎం కిషన్ కోరారు. డివిజన్‌స్థాయి విద్యుత్ సదస్సు నర్సంపేటలోని పద్మశాలీ ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా విద్యుత్ ఆదాకు తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. కార్యక్రమంలో ఎస్ఈ మధుసుదన్, డీఈ శ్రీధర్, ఏడీఈలు, ఏఈలు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎంజీఎం దవాఖానలో ఏడీ ఎవరు?

పోచమ్మమైదాన్, మే 3 : వరంగల్ ఎంజీఎం దవాఖానలో అసిస్టెంట్ డైరెక్టర్(ఏడీ) ఎవరనేది ప్రశ్నార్థకంగా, వివాదంగా మారింది. ఏడీ లక్ష్మీరాజంను మూడు రోజుల క్రితం డైరెక్టర్ ఆఫ్ హెల్త్‌కు సరెండర్ చేశారు. వెంటనే ఆయన స్థానంలో ఎంజీఎం బ్లడ్ బ్యాంకులో పని చేస్తున్న డాక్టర్ ప్రసాద్‌కు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. అయితే, లక్ష్మీరాజం హైకోర్టును ఆశ్రయించారు. దీంతో కోర్టు ఏ ఇవ్వడంతో శుక్రవారం విధుల్లో చేరేందుకు ఆయన వచ్చారు. ఏడీని సరెండర్ చేసే అధికారం ప్రభుత్వానికి ఉంటుందని, ఉన్నతాధికారులకు ఉండదని, ఆయనను యథావిధిగా సర్వీసులో కొనసాగించాలని కోర్టు ఉత్తర్వులో పేర్కొన్నట్లు తెలుస్తున్నది. దీనిపై కౌంటర్ దాఖలు చేయాలంటే ప్రస్తుతం కోర్టుకు వేసవి సెలవులు ఉన్న దృష్ట్యా జూన్ 6న రావొచ్చని సమాచారం.

బయోకెమిస్ట్రీలో నిలిచిన రక్త పరీక్షలు

పోచమ్మమైదాన్, మే 3: వరంగల్ ఎంజీఎం దవాఖానలోని బయోకెమిస్ట్రీ విభాగంలో పలు రకాల పరీక్షలు నిలిచిపోవడంతో శుక్రవారం రోగులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఎల్ఎఫ్‌టీ, ఆర్ఎఫ్‌టీ, థైరాయిడ్ పరీక్షలు చేయలేదు. అసలే వేసవి కాలం.. ఆపై దూర ప్రాంతాల నుంచి వచ్చిన పేషంట్లు వివిధ రక్త పరీక్షల కోసం ఎదురుచూడాల్సి వచ్చింది. పరికరాలు గురువారం నుంచే పని చేయలేదు. దీంతో అత్యవసర పరీక్షల కోసం వచ్చిన రోగులు ప్రైవేట్ ల్యాబ్‌లకు వెళ్లాల్సి వచ్చిందని అటెండెంట్లు తెలిపారు.

'డిగ్రీ పరీక్షలను వాయిదా వేయాలి'

పోచమ్మమైదాన్, మే 3: కేయూ పరిధిలోని డిగ్రీ సెమిస్టర్ పరీక్షలను వాయిదా వేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ల్యాదెళ్ల శరత్ డిమాండ్ చేశారు. దేశాయిపేటలోని సీకేఎం కాలేజీ ఆవరణలో శుక్రవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 6 నుంచి జూన్ 16 వరకు పరీక్షలు నిర్వహించేందుకు అధికారులు షెడ్యూల్ విడుదల చేశారని, ఉష్ణోగ్రతలు అధికంగా ఉన్నందున ఓయూలో పరీక్షలను జూన్ రెండో వారానికి వాయిదా వేశారన్నారు. కేయూ పరిధిలో కూడా వాయిదా వేయాలని కోరారు. ఆయన వెంట సాగర్, రమేశ్, శివ, కుమార్, కార్తీక్ ఉన్నారు.

ఇద్దరిపై కేసు నమోదు

హసన్‌పర్తి, మే 3 : కార్యదర్శిని బెదిరించిన మాజీ సర్పంచ్ తిరుపతమ్మ, ఆమె భర్త మల్లారెడ్డిపై కేసు నమోదైంది. సీఐ సురేశ్ కథనం ప్రకారం.. గంటూరుపల్లిలో జూనియర్ పంచాయతీ కార్యదర్శిగా పని చేస్తున్న పొడిశెట్టి రజిత శుక్రవారం విధులకు హాజరైంది. ఇదే గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ పెద్ది తిరుపతమ్మ, ఆమె భర్త మల్లారెడ్డి తాము చేసిన పనులకు బిల్లులు చేయాలని కొద్ది రోజుల నుంచి ఒత్తిడి తెస్తున్నారు. సరిగా లేనందున బిల్లులు పెట్టలేనని రజిత తేల్చిచెప్పి బీరువా తాళం వేస్తున్న క్రమంలో తిరుపతమ్మ కార్యదర్శి బ్యాగు, సెల్‌ఫోన్‌ను దౌర్జన్యంగా లాక్కొని దూషించారు. రజిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి

సంగెం, మే 3 : మహిళలు వ్యాపారాలను ఏర్పాటు చేసుకుని ఆర్థికంగా ఎదగాలని సెర్ప్ సంస్థాగత నిర్మాణ డైరెక్టర్ నవీన్ అన్నారు. శాంతి మండల సమాఖ్య సంగెం కార్యాలయాన్ని శుక్రవారం సందర్శించారు. మోడల్ సీఎల్ఎఫ్, ఎమ్మార్సీ ఏర్పాటుకు కార్యాలయ పరిసరాలను పరిశీలించారు. ప్రాజెక్టు మేనేజర్ తక్కళ్లపల్లి రవీందర్‌రావు, అడిషనల్ డీఆర్డీవో రేణుకాదేవి, డీపీఎంలు దయాకర్, సరిత, భవాని, చంద్రశేఖర్, ఏపీఎం కిషన్ పాల్గొన్నారు.

ఓటుహక్కును వినియోగించుకోవాలి

చెన్నారావుపేట, మే 3 : ప్రతి ఒక్కరూ ఓటుహక్కు వినియోగించుకోవాలని వినియోగదారుల ఫోరం జిల్లా కార్యదర్శి ఈగ సత్యనారాయణ అన్నారు. మండలకేంద్రంలోని కోపాకుల చెరువులో పని చేస్తున్న ఉపాధి కూలీలకు అవగాహన కల్పించారు. బెజ్జంకి ప్రభాకర్, వసంత, నాగెళ్లి సారంగం పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో చేరుతున్న ప్రజలు : ఎర్రబెల్లి

నాయకులను పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎర్రబెల్లి

ఐనవోలు, మే 3 : అబద్ధాలతో కాలం వెల్లదీస్తున్న పార్టీలను నమ్మకుండా నాయకులు, ప్రజలు బీఆర్ఎస్‌లో చేరుతున్నారని మాజీ మంత్రి, పార్టీ లోక్‌సభ ఎన్నికల వర్ధన్నపేట నియోజకవర్గ ఇన్‌చార్జి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. శుక్రవారం వనమాలకనర్తిలో మాజీ ఉప సర్పంచ్ రిపిక రమేశ్, బీజేపీ మహిళా అధ్యక్షురాలు సింగారపు పుష్ప, మాజీ వార్డు మెంబర్ బండి సతీశ్, శకుంతల, కళ, కమల, శ్యామ్, చింటుతోపాటు వంద మంది కాంగ్రెస్, బీజేపీ నుంచి బీఆర్ఎస్‌లో చేరారు. వారికి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. గుజ్జ గోపాల్‌రావు, వైస్ ఎంపీపీ తంపుల మోహన్, గ్రామ అధ్యక్షుడు సింగారపు చందర్, ముత్తినేని రాజు, రిపిక రాజు, మడ్డి కిషన్, శ్వేత, పూల, సింగారపు కుమారస్వామి, కొట్టె రంజిత్ పాల్గొన్నారు.

పోస్టల్ బ్యాలెట్ పోలింగ్ ప్రారంభం

వరంగల్, మే 3 : ఈ నెల 13న జరిగే పోలింగ్‌లో భాగంగా పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ శుక్రవారం ప్రారంభమైంది. ఎన్నికల విధులు నిర్వర్తిస్తున్న ఉద్యోగుల కోసం పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఎల్‌బీ కళాశాలలో తూర్పు నియోజకవర్గ పరిధిలోని ఉద్యోగులు, పశ్చిమ నియోజకవర్గ పరిధిలోని ఉద్యోగులకు ప్రభుత్వ పాఠశాల, హనుమకొండలో పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. తూర్పు నియోజవర్గ పరిధిలో 1043 మంది పోస్టల్ బ్యాలెట్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో తొలిరోజు 25 మంది ఉద్యోగులు ఓటు హక్కును వినియోగించుకున్నారు. శుక్రవారం ఎల్‌బీ కళాశాల పోస్టల్ బ్యాలెట్ పోలింగ్ కేంద్రాన్ని జిల్లా రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ ప్రావీణ్య పరిశీలించారు. ఈ నెల 8వ తేదీ వరకు ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కును వినియోగించుకునే అవకాశం ఉందన్నారు.

సుధీర్‌కుమార్ గెలుపే లక్ష్యంగా ప్రచారం..



గుడిబండలలో ప్రచారం చేస్తున్న నాయకులు

హనుమకొండ చౌరస్తా, మే 3 : బీఆర్ఎస్ వరంగల్ ఎంపీ అభ్యర్థి మారెపల్లి సుధీర్‌కుమార్ గెలుపే లక్ష్యంగా కారు గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థిస్తూ 8వ డివిజన్ ఏనుగుల గడ్డలో బీఆర్ఎస్ నాయకులు ప్రచారం నిర్వహించారు. మాజీ అధ్యక్షుడు పానుగంటి శ్రీధర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రచారంలో బోయిని విజయ్, రమేశ్, దేవులపల్లి ప్రదీప్, ఎర్రోజు భాస్కర్, అశోక్, రుద్రోజు సంపత్ పాల్గొన్నారు.

పనులు పూర్తి చేయకపోతే తరిమికొడతరు..

భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

శాయంపేట, మే 3 : అభివృద్ధి పనులు సకాలంలో పూర్తి చేయకపోతే ప్రజలు తరిమికొడతారని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. రూ.7కోట్లతో చేపట్టిన చలివాగు అభివృద్ధి పనులను జూన్‌లోగా పూర్తి చేయకపోతే రైతులు కర్రలను పట్టుకుంటారని, ఆ పరిస్థితి తెచ్చుకోవద్దన్నారు. మండల సర్వసభ్య సమావేశం శుక్రవారం ఏర్పాటు చేశారు. దీనికి ఎంపీపీతో పాటు 10 మంది సభ్యులు హాజరు కాలేదు. పత్తిపాక ఎంపీటీసీ ఒక్కరే హాజరు కావడంతో కోరం లేదని సభను వాయిదా వేశారు. అనంతరం ఎమ్మెల్యే ముఖ్యమైన సమస్యలపై రివ్యూ నిర్వహించారు. కాగా, జిల్లా కో-ఆపరేటివ్ అధికారులు ఎవరూ సమావేశానికి రాకపోవడంతో ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. సభకు రాని వారిపై మంత్రులకు ఫిర్యాదు చేస్తానన్నారు. వారి వివరాలు కలెక్టర్‌కూ పంపించాలని ఎంపీడీవోకు సూచించారు. సమావేశంలో తహసీల్దార్ సుభాషిణి, ఎంపీడీవో ఫణిచంద్ర పాల్గొన్నారు.

రెడ్‌క్రాస్ సేవలను వినియోగించుకోవాలి

దామెర, మే 3 : రెడ్‌క్రాస్ సొసైటీ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని రెడ్‌క్రాస్ పాలకవర్గ సభ్యుడు ఈవీ శ్రీనివాస్ సూచించారు. శుక్రవారం ల్యాదెళ్ల గామంలో హనుమకొండ రెడ్‌క్రాస్ సొసైటీ, మొబైల్ మెడికేర్ యూనిట్ ఆధ్వర్యంలో వృద్ధులకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించి, మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ జిల్లా పాలకవర్గ సభ్యులు బిల్లా రమణారెడ్డి, డాక్టర్ కిషన్‌రావు, డాక్టర్ మహ్మద్ తహర్‌మసూద్, సిబ్బంది శివకుమార్, గంగాధర్, పవన్ పాల్గొన్నారు.

విద్యుత్ ప్రమాదాలపై జాగ్రత్తగా ఉండాలి

రాయపర్తి, మే 3 : వేసవిలో విద్యుత్ ప్రమాదాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మైలారం ఏఈ నిఖిల్‌కుమార్ కోరారు. విద్యుత్ భద్రతా వారోత్సవాల్లో భాగంగా మైలారం సబ్‌స్టేషన్‌లో వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఎస్ఈ ముజాఫర్, జేఎల్ఎం శ్రీనివాస్, దయాకర్, శ్రీకాంత్, సునీల్, సురేందర్,అన్వర్, రాజు, సందీప్ పాల్గొన్నారు.

Form C-1

(For Candidate publish in Newspapers, TV.)

Declaration about criminal cases.

(As per the judgment dated 25th September, 2018, of Hon'ble Supreme Court in WP (Civil) No. 536 of 2011 (Public interest Foundation & Ors